# బోల్తా కొట్టిన రిక్షా

గణ గణ గణ గణ....

ఒక బక్కచిక్కిన రిక్షావాడు బాగా బలిసివున్న వ్యాపారస్తుణ్ణి తన రిక్షామీద కూర్చోబెట్టుకొని లాక్కువెళ్తున్నాడు. ఎంతమారంనుంచి లాక్కువెళుతున్నాడోగాని, తెగ రొప్పుతున్నాడు. అతని అడుగులు క్రింద వాలుతున్నట్లు లేవు. గాలిమీద తేలిపోతున్నాడు. రిక్షా ముందుకు వెడుతుంటే, తానుదాన్ని పట్టుకొనివేళ్ళాడుతున్నట్లు అనిపించింది.వ్యాపారస్తుడికిమానవునికి వుండవలసిన అవయవాలన్నీ వున్నై. కాని వుండవలసిన మోతాదులో లేవు. బొజ్జ పెద్దది. అందుకని కాళ్ళు బారచాచి, వెనక్కి ఆనుకొని, గోడకి నిలవేసినతవుడు బస్తాలా కూర్చుని ఉన్నాడు. ఆ రిక్షావాణ్ణి, వ్యాపారస్తుణ్ణీ ఎక్కడో చూచినట్టు అనిపించింది నాకు. అనిపించట జ్ఞాపకం రావటం రెండూ ఇంచుమించు ఒకేసారి జరిగినాయి. ఆ రిక్షా భారతదేశం. రిక్షావాడు భారతదేశంలో ఉన్న మూర్తిభవించిన దారిద్ర్యం. ఆ వ్యాపారస్తుడు కేంద్రీకరించిన రొఖ్ఖం.

"ఆపరా" అన్నాడు వ్యాపారస్తుడు.

రిక్షావాడు ఆగాడు. కొంతసేపటికి రిక్షా ఆగింది.

రిక్షాలోనే కూర్చొని వ్యాపారస్తుడు ఎవరితోనో మాట్లాడుతున్నాడు. అతను వాళ్ళకొట్లోగుమాస్తా ఆ వ్యాపారస్తునికి మూడు ఫాక్టరీలు, రెండు బట్టలకొట్లూ, ఒక పెద్ద పచారీ షాపూ ఉన్నాయి. మొత్తం అతని వ్యాపారాన్ని బ్లాక్ మార్కెట్ వ్యాపారం అని పిలవచ్చు.

"వాళ్ళకేం? వాళ్ళు అలాగే అంటారు, బ్లాక్‌మార్కెట్టట! వ్యాపార ధర్మం తెలియకపోతే సరి. ఒచ్చేటప్పుడు రాబట్టుకోకపోతే, చెయ్యిదాటిన తర్వాత ఇమ్మంటే ఇస్తారా?" అంటున్నాడు వ్యాపారస్తుడు.

"ముంసీ ఆఫీసర్లతో వస్తున్నాం" అన్నాడు గుమాస్తా.

"వాళ్ళ ముడుపుకోసం వాళ్ళు" అని చీదరించుకున్నాడు ఆయన.

"చిత్తం" అన్నాడు గుమాస్తా.

"వాళ్ళనోళ్ళు మూతవెయ్యటం ఎంతసేపూ?" అన్నాడు ఆయన చిరునవ్వు నవ్వుతూ.

ఆయన మొహాన చిరునవ్వు కనపట్టం అన్నప్పుడల్లా జరిగేపని కాదు. నూటికి కోటికి ఒకసారి తళుక్కున మెరుస్తుంది.

గుమాస్తా ఆ దర్శన భాగ్యానికి పుష్పితపల్లవుడవుతూ "చిత్తం, చిత్తం, తమరు తలచుకుంటే...." అన్నాడు.

"నడవరా" అన్నాడు ఆయన రిక్షావాణ్ని వాడు నడిచాడు. వాడి వెంటే రిక్షా నడిచింది.

గణ గణ....గణ గణ....

రిక్షావాడు బహు కష్టంమీద లాగుతున్నాడు. గుమాస్తాతో మాట్లాడిన తర్వాత వ్యాపారస్తుడు రెట్టింపు బరువెక్కాడు. కొంచెందూరం వెళ్ళం తర్వాత "ఆపరా" అన్నాడు ఆయన మళ్ళీ.

రిక్షావాడు ఆగాడు. వెంటనే రిక్షా ఆగింది.

వ్యాపారస్తుడు రిక్షామీద కూర్చొనే, మరొకరితో మట్లాడుతున్నాడు. "ధరలు పెరిగేటట్లున్నాయి. మన కేం తొందరా" అన్నాడు కొత్తమనిషి.

"స్టాక్ చెయ్యండి" అన్నాడు ఆయన.

"చిత్తం, కాని ఈ అలగా జనం గోల పడలేకుండా వున్నాం" అన్నాడు కొత్తమనిషి.

"వాళ్ళ దెప్పుడూ వుండేగోలే" అన్నాడు ఆయన.

"చిత్తం, ఫ్యాక్టరీల చుట్టూ మిడతల దండుకు మల్లే మూగుతున్నారు"

"పోలీసుకి కబురు చెయ్యండి" అన్నాడు ఆయన.

"చిత్తం" అన్నాడు కొత్తమనిషి.

"నడవరా" అన్నాడు ఆయన రిక్షావాణ్ని. రిక్షావాడితో పాటు రిక్షా కదిలింది. ఈ సారి ఆయన మూడురెట్లు బరువెక్కాడు.

గణ....గణ....గణ....గణ !

రిక్షావాడు లాగలేక, లాగలేక లాగుతున్నాడు. రిక్షా కదల్లేక కదల్లేక కదులుతూ వుంది.

"ఆపరా" అన్నాడు ఆయన.

రిక్షా ఆగేవుంది.

ప్రక్కన ఆదుర్దాగా వెళుతున్న పెద్దమనిషిని పిలిచి మాట్లాటం మొదలుపెట్టాడు ఆయన.

"కార్మికులూ,కమ్యూనిస్టులూ ఫ్యాక్టరీలను చుట్టుముట్టారు"అన్నాడు పెద్దమనిషి.

"కమ్యూనిస్టులా?" అని భయపడ్డాడు వ్యాపారస్తుడు.

"ఆఁ!" అన్నాడు పెద్దమనిషి.

"వాళ్ళ కేం పనీ?" అడిగాడు వ్యాపారస్తుడు.

"వాళ్ళే కార్మికుల్ని పోగుజేసింది" చెప్పాడు పెద్దమనిషి.

"ప్రభుత్వం వూరుకుందా?" అడిగాడు వ్యాపారస్తుడు.

"పోలీసులను పంపించింది" చెప్పాడు పెద్దమనిషి.

"వాళ్ళు ఊరుకున్నారా?" అడిగాడు వ్యాపారస్తుడు.

"తుపాకులు పేల్చారు" చెప్పాడు పెద్దమనిషి.

"ఆఁ—?" అన్నాడు వ్యాపారస్తుడు.

"పదిమంది మరణించారు. పాతికమందికి గాయాలు తగిలినై. వందమందిని అరెస్టుచేశారు" అన్నాడు పెద్దమనిషి.

'కమ్యూనిస్టులేనా?' అడిగాడు వ్యాపారస్తుడు.

"ఇప్పుడెలా వుంది?" అడిగాడు వ్యాపారస్తుడు.

"గుంపంతా చెల్లాచెదురైంది" అన్నాడు పెద్దమనిషి, "ఫ్యాక్టరీలను పోలీసులు కాపలా కాస్తున్నారు."

వ్యాపారస్తుడు రిక్షాలో కూర్చునే ఆలోచించాడు, కమ్యూనిస్టుల్ని హతమార్చాలి. లేకపోతే తన నోట మట్టే, తన బ్రతుకు కత్తిమీద సాము అవుతుంది. 'ప్రభుత్వంలో అంతా మనకు తెలిసినవాళ్ళే, వాళ్ళ చెవిని ఒక మాట వేసి వొస్తే మంచిది' అనుకున్నాడు.

"నడవరా" అన్నాడు రిక్షావాణ్ని.

రిక్షావాడు ఒక గుంజా గుంజాడు. ఈ సారి వ్యాపారస్తుడు నాలుగు రెట్లు బరువెక్కాడు.

గణ గణ గణ గణ....

పక్కగా మనుషులు వెళుతున్నారు. బళ్ళు వెళ్తున్నై. కార్లు వెళ్తున్నై. రిక్షావాడు బరువు మోయలేకపోతున్నాడు. రిక్షా లాగలేక పోతున్నాడు.

గణ గణ గణ గణ ....

వ్యాపారస్తుడు "ప్రభుత్వంవారితో ఎలా మాట్లాడవలసిందీ ఆలోచిస్తున్నాడు. కమ్యూనిస్టులమీద ఏమి చెబితే వారికి నచ్చుతుందో వూహించుకుంటున్నాడు.... కమ్యూనిస్టులు ప్రధానమంత్రి మీద చేస్తున్న దుష్ప్రచారం, మొన్న మీటింగులో వాళ్ళు ఆయన్ని తిట్టిన తిట్లూ....

గణ గణ గణ గణ....

రిక్షావాడు ఊగిపోతున్నాడు. ఎదురుగా సైకిలు వొచ్చింది. "ఆఁ! ఆఁ?" అన్నాడు వ్యాపారస్తుడు భయంతో వెనక్కి వొరిగాడు. రిక్షావాడు అదిమిపట్టుకోలేక చేతులు వొదిలాడు. రిక్షా తలక్రిందయింది. వ్యాపారస్తుడు బోర్లా బొక్కలా పడ్డాడు. రిక్షా విరిగింది. రిక్షావాడు కూలబడ్డాడు. వ్యాపారస్తుడు తన దెబ్బలు చూసుకొని కన్నీరు పెట్టుకుంటున్నాడు. రిక్షావాడికి తన సంగతి పట్టలేదు. "అయ్యో, నా రిక్షా" అని విలపిస్తున్నాడు — విరిగిన రిక్షాని తడుముతూ!

వాళ్ళని చూస్తుంటే మూర్తీభవించిన దారిద్ర్యం భారతదేశానికి నష్టంకలిగించనని విలపిస్తున్నట్టూ, కేంద్రీకరించిన రొఖ్ఖం, తనకు ఇబ్బంది కలిగించనని కన్నీరు పెట్టుకుంటున్నట్టూ అనిపించింది నాకు.

—o—